క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మకు బోనాలు



బోనాలను తీసుకెళుతున్న మహిళలు

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న హెచ్‌పీసీఎల్ సమీపంలో వెలసిన శ్రీ ఎల్లమ్మకు గురువారం భక్తులు బోనాలను సమర్పించి పూజలు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎల్లమ్మను దర్శించుకొని పూజలు నిర్వహించి కాయా కర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

అన్నదానం చేయడంలోనే అసలైన సంతోషం

రాయచోటి జగదాంబసెంటర్ : అన్ని దానాల్లో కన్నా ఆకలిగొన్న వారికి ఆకలి తీర్చడంలోనే అసలైన సంతోషం ఉంటుందని లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ అధ్యక్షులు శ్యామ్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో గురువారం రాయచోటి పట్టణానికి చెందిన ఊటుకూరి కిరణ్‌కుమార్ కుమార్తె మనస్వి పుట్టినరోజు సందర్భంగా భవితా కేంద్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ మహమ్మద్, మాజీ అధ్యక్షుడు శివారెడ్డి, కోశాధికారి మనోహర్‌రాజు, షంషీర్‌వలి, భవిత కేంద్రం సిబ్బంది జనార్దన్, త్రిలోక్ తదితరులు పాల్గొన్నారు.

గంగనేరులో గడికోట



రాచపల్లెలో కార్యకర్తలతో కలిసి పర్యటిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : రామాపురం మండలం రాచపల్లె గ్రామం గంగనేరులో వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి గురువారం పర్యటించారు. ప్రజల కష్ట నష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గంగనేరు గ్రామ వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు సాయిపీర్ కుటుంబంలో జరిగిన హకీకా కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు విద్యాసామగ్రి అందజేత



విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేసిన ట్రస్టు సభ్యులు

లక్కిరెడ్డిపల్లె : చక్రాయపేట మండలంలోని వృద్ధులు, అనాథ పిల్లల ఆశ్రమంలోని విద్యార్థులకు రూ.5 వేల నగదుతో పాటు విద్యా సామగ్రిని మథర్ థెరిసా ఛారిటబుల్ ట్రస్టు ఫౌండర్ రెవరెండ్ ఎల్.విజయమోహన్ రెడ్డి, రెవ. జయప్రకాశ్ రెడ్డిలు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఆపన్నహస్తంలా తమ ట్రస్టు అండగా ఉంటుందన్నారు. విద్యార్థులకు మంచి విద్యను అందజేయాలని వారు కోరారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె క్రిష్టియన్ మైనార్టీ అధ్యక్షులు ప్రేమ్ కుమార్, ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు అల్ఫోన్స్ రెడ్డి, వృద్ధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురు పరంపర కొనసాగాలి

నందలూరు : గురు పరంపర కొనసాగాలని శ్రీ జ్ఞాన ప్రసాద్ గురూజీ పేర్కొన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ అరవపల్లెలోని శ్రీ కృష్ణ గీతా మందిరంలో ఆయన ఆధ్వర్యంలో గురువారం గురుపౌర్ణమి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువు ప్రాముఖ్యత, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎటువంటి లక్షణాలు అలవరచుకోవాలో వివరించారు. కార్యక్రమంలో కొత్తపల్లి రాజా ఆచారి, ఎంబలూరు అనిల్‌కుమార్, ఎంబలూరు నరసింహ ప్రసాద్, ఎంబలూరు ప్రదీప్‌కుమార్, గెలివి సురేంద్ర, వాకటి శివ, తాటి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలు అవసరం

చిట్వేలి : పిల్లలకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని, తైక్వాండో వలన శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసం, స్వీయరక్షణ సాధ్యమవుతుందని రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. చిట్వేలిలో కొత్తగా ఏర్పాటు చేసిన ఏఎస్‌వీకే స్పోర్ట్స్ అకాడమీని గురువారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన చిట్వేలిలో ఏర్పాటు చేసిన తైక్వాండో సెంటర్‌ను ఏర్పాటు చేసిన శివాజీ అభినందనీయుడన్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త గాడి ఇంతియాజ్, ఫిట్‌నెస్ మాస్టర్ బాలే నాగేశ్వర్, సాయి వికాస్ పాఠశాల కరస్పాండెంట్ రెడ్డయ్య, స్థానికులు సుబ్బరాయుడు, రోళ్ల మోహన్, సుధీర్ రెడ్డి, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యత పట్టదు.. బెడద తీరదు!

- రాజంపేట వాసులను వేధిస్తున్న పందుల బెడద
- నిర్లక్ష్యం వహిస్తున్న రెవెన్యూ యంత్రాంగం
- ప్రాణాంతకరమైన వ్యాధులు ప్రబలే ప్రమాదముందంటున్న వైద్యులు
- ఉన్నతాధికారులు చొరవ చూపాలంటున్న ప్రజలు



ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో సంచరిస్తున్న పందులు

రాజంపేట టౌన్ : రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం రాజంపేట ప్రజలకు శాపంగా మారింది. మున్సిపాలిటీ పరిధిలో పందుల బెడద అధికంగా ఉండటంతో ప్రజలు ఎక్కడ వ్యాధుల బారిన పడతారో అని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి దాదాపు మూడున్నర సంవత్సరాల క్రితం పందుల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా జనసంచారం లేని ప్రాంతాలకు పందులను తరలించేందుకు మున్సిపల్ చైర్మన్ ఏర్పాట్లు చేశారు. అయితే పందుల పెంపకందారులు పందుల పెంపకానికి స్థలం చూపించాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో పందుల పెంపకానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన తరువాతే పందుల నివారణకు చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం మున్సిపల్ అధికారులను ఆదేశించింది. దీంతో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి అప్పటి కలెక్టర్ కేతన్‌గార్గ్‌ను కలిసి పందుల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించడంతో పాటు న్యాయస్థానం ఆదేశాలను కూడా ఆయనకు వివరించి జనసంచారం లేని ప్రాంతంలో పందుల పెంపకందారులకు ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని వినతిపత్రం ద్వారా కోరారు. అయితే కొంత కాలానికే కేతన్‌గార్గ్ బదిలీ అయ్యారు. అనంతరం ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణారెడ్డికి కూడా మున్సిపల్ చైర్మన్ సమస్యను తెలిపి స్థలాన్ని కేటాయించాలని కోరినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో పట్టణంలో పందుల సంఖ్య పెరిగిపోతూ వస్తోంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటం, దీనికి తోడు మున్సిపాలిటీ పరిధిలోని 29 వార్డుల్లో పందుల బెడద అధికంగా ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ అధికారులు పందుల పెంపకందారులకు స్థలాన్ని కేటాయించడంలో అలసత్వం చూపుతుండటం వల్ల ఇప్పుడు ప్రజలకు అది శాపంగా మారింది.

మెదడువాపు వ్యాధి వచ్చే ప్రమాదం

పందులను కుట్టిన దోమలు మనుషులను కుడితే మెదడువాపు వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. మెదడువాపు వ్యాధి వల్ల మనిషి చనిపోయే ప్రమాదం ఉంటుందని వైద్యులు అంటున్నారు. పందులపై వాలిన దోమలు ఆహార పదార్థాలపై వాలి ఆ ఆహార పదార్థాలను తిన్నా మనిషి అనారోగ్యం బారిన పడే ప్రమాదముంటుంది. పందులు జనసంచారంలో తిరగడం వల్ల అతిసార, ఊపిరితిత్తుల జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు తెలియజేశారు.

కలెక్టర్ స్పందిస్తేనే సమస్య పరిష్కారం

జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి స్పందిస్తే రాజంపేట మున్సిపాలిటీలో పందుల బెడద సమస్య పరిష్కారం అవుతుందని పట్టణ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే పందులను జనసంచారం లేని ప్రాంతాలకు తరలించేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు పందుల పెంపకానికి జనసంచారం లేని ప్రాంతంలో స్థలం కేటాయించాల్సి వుందని, అందువల్ల జిల్లా కలెక్టర్ స్పందించి కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తే వీలైనంత త్వరగా సమస్యకు పరిష్కారం లభిస్తుందని పట్టణ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మానవీయ కోణంలో చూడాలి



ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నందున పందుల వల్ల ముఖ్యంగా చిన్నపిల్లలకు జబ్బులు సోకే ప్రమాదముంది. ప్రతి వీధిలో పందులు ఎక్కువగా సంచరిస్తుండటంతో చిన్నపిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా కలెక్టర్ రాజంపేటలోని పందుల బెడద సమస్యపై మానవీయ కోణంలో చూడాల్సిన అవసరం ఎంతైనా వుంది. జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకుంటేనే సమస్య పరిష్కారం కాగలదు. అందువల్ల కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాం.

- షేక్ అబ్దుల్లా, సంఘసేవకుడు, రాజంపేట

అగస్త్యేశ్వరాలయంలో కల్యాణం



రాయచోటి జగదాంబ సెంటర్ : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణం పాత రాయచోటిలో వెలసియున్న పురాతన శ్రీ దాక్షాయణీ సమేత శ్రీ అగస్త్యేశ్వరాలయంలో గురుపౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వేదపండితులు కల్యాణ క్రతువును వైభవంగా చేశారు. పలువురు భక్తులు కార్యక్రమంలో పాల్గొనగా వారికి ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

నేడు భక్తులకు అన్నదానం

నందలూరు : నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి కల్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నాయకులు సోమలరాజు చంద్రశేఖర్‌రాజు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్టీసీ రీజనల్ మాజీ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ దుబాయ్‌కి చెందిన సింగిరి ట్రస్ట్ ప్రతినిధులు సింగిరి రవికుమార్, సింగిరి సుధాకర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మజ్జిగను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఏడాదిలోనే కూటమిపై తీవ్ర వ్యతిరేకత



మాట్లాడుతున్న పాపినేని విశ్వనాథ్‌రెడ్డి

రాజంపేట టౌన్ : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ప్రజాభిమానాన్ని అడ్డుకోవాలని అనుకోవడం అవివేకమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

జగన్‌కు వస్తున్న ప్రజాభిమానాన్ని కూటమి నాయకులు ఓర్చుకోలేక పోతున్నారన్నారు. జగన్‌ను తక్కువ చేసేందుకు పులివెందుల ఎమ్మెల్యే అని అంటూ కూటమి నాయకులు చేస్తున్న విమర్శలకు ఆయన పర్యటనలకు వస్తున్న జనమే సమాధానమన్నారు. వైఎస్ జగన్ ఎమ్మెల్యే మాత్రమే అయితే బంగారుపాళ్యంలో మా నాయకుడి పర్యటనకు మూడు జిల్లాలకు చెందిన ఎస్పీలు, ఏఎస్పీలు, డీఎస్పీలు వందల మంది పోలీసులతో ఎందుకు బందోబస్తు నిర్వహించారని పాపినేని ప్రశ్నించారు. జగన్ ఒక వ్యక్తి కాదని ఒక శక్తి అన్నారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నుంచే కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేలా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రజలను సమాయత్తం చేయాలన్నారు.

ప్రకృతి వ్యవసాయం శ్రేయస్కరం



స్టాల్ ఏర్పాటు చేసిన అధికారులు

సుండుపల్లె : ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిన ఆహార పదార్థాలను వాడటం ఎంతో శ్రేయస్కరం అని వైద్యాధికారులు డా.దిలీప్‌గుప్తా, డా.ఫర్హానా అన్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిన కూరగాయలు, ఆకుకూరలు వాడటం వలన మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, రసాయనిక పురుగు మందులు, ఎరువులు వాడిన ఆహార పదార్థాలు తినడం వలన అనేక రోగాలు కొని తెచ్చుకుంటున్నామని చెప్పారు. షుగర్, బీపీ, అలాగే గర్భిణులకు పోషకాలు కలిగిన ఆహారం అందించవచ్చునని వివరించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ రవీంద్రగౌడ్, మోడల్ మేకర్లు రామాంజనేయులు, వీరనాగయ్య, యూనిట్ ఇంచార్జ్‌లు రామ్మోహన్, ఆంజనేయులు, ఐసీఆర్‌పీలు గురులక్ష్మి, లక్ష్మి, సుమలత, రత్నమ్మ, కొండమ్మ, నిర్మల, రామచంద్ర, శివరాం, వీరనాగయ్య పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

సిద్దవటం : రైతులకు ప్రభుత్వం అమలు చేసే పథకాలపై రైతు సేవా కేంద్రాల వ్యవసాయ సహాయ సిబ్బందికి సిద్దవటం మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర మండలాల నుంచి బదిలీపై సిద్దవటం మండలానికి వచ్చిన వ్యవసాయ శాఖ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు పరిచే అన్నదాత సుఖీభవ, పి.ఎం. కిసాన్, ఇ–క్రాప్ నమోదు ఎరువుల పంపిణీ వంటి పథకాలపై రైతులకు అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు అందించాలని, విధి నిర్వహణలో అలసత్వం చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఫీల్డ్ వర్క్‌పై వెళ్లే ఉద్యోగులు మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేసి వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సిబ్బంది హసీనా బేగం, చంద్ర, శివప్రసాద్, మోహన్, జయపాల్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సాధికారతకు ఏటీఎం మోడల్‌తో మరో అడుగు



ఏటీఎం మోడల్‌పై రైతులకు వివరిస్తున్న అధికారులు

చిన్నమండెం : ఏటీఎం మోడల్‌తో రైతుల సాధికారతకు మరో అడుగు పడనుందని ఏఈఓ బ్లెస్సీ తెలిపారు. చిన్నమండెంలోని ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ వద్ద ప్రకృతి వ్యవసాయ ఏటీఎం విధానంలో విత్తనాలు నాటారు. ఈ సందర్భంగా ఏఈఓ బ్లెస్సీ, పీహెచ్‌సీ వైద్యురాలు డా.సునీత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిన కూరగాయలు, ఆకుకూరలు తినడం వలన శరీరానికి పౌష్టికాహారం అంది ఆరోగ్యకరంగా ఉంటామని రైతులకు తెలియజేశారు. ఎటువంటి రసాయనాలు లేకుండా ప్రకృతి పద్ధతిలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందడం ఈ మోడల్ ద్వారా సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీలు శ్రీనివాస్, పద్మావతి, మోడల్ మేకర్ రెడ్డయ్య, వాల్యూ చైన్ చంద్రశేఖర్, కమ్యూనికేషన్ వీణ, ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సమావేశం

గాలివీడు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండలస్థాయి విస్తృత సమావేశాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర మాజీ డీసీపీ జిల్లా సుదర్శన్ రెడ్డి, పార్టీ కన్వీనర్ యదుభూషణ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల నాగభూషణ్‌రెడ్డి, మైనారిటీ అధ్యక్షులు ఎస్కే ఖాదర్‌మోహిద్దీన్ తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రమేష్ కుమార్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి సుబ్రమణ్యం హాజరవుతారన్నారు. శనివారం ఎస్కే ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం జరగబోవు ఈ సమావేశానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు హాజరుకావాలని తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చిన్నమండెం : మండలంలోని కొత్తపల్లె పంచాయతీ మల్లూరు క్రాస్ వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో కొండారెడ్డి అనే వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు కొత్తపల్లికు చెందిన శెట్టిపల్లి కొండారెడ్డి సొంత పనులు చూసుకొని స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా మదనపల్లె నుంచి రాయచోటికి వెళ్తున్న కారు ఢీ కొందన్నారు. ప్రమాదంలో కొండారెడ్డికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు వైఎస్సార్‌సీపీ సవాల్

- నియోజకవర్గంలో విచ్చలవిడిగా అక్రమ దందాలు, మద్యం మాఫియా
- టీడీపీ నియోజకవర్గ నాయకుల వ్యాఖ్యలపై బహిరంగ చర్చకు డిమాండ్
- కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం పట్టడంలేదు
- విలేకరుల సమావేశంలో కూటమి పాలనపై విరుచుకుపడిన వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలో కూటమి నాయకుల అడ్డగోలు దోపిడీకి అంతేలేకుండా పోతోందని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నందబాల, పట్టణం కన్వీనర్ సీహెచ్ రమేష్‌లు విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో కూటమి నాయకుల ఇసుక అక్రమ రవాణా, మద్యంలో భారీగా దోచుకు తింటున్నారని టీడీపీ నాయకులే సమావేశాలు ఏర్పాటు చేసి వ్యాఖ్యానిస్తుండటం పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలపై ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ బహిరంగ చర్చ సిద్ధమా అని సవాల్ విసిరారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ప్రజలకు సంక్షేమం అందాక, నియోజకవర్గంలో అభివృద్ధి జరగక అవస్థలు పడుతున్నారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే టెంకాయ కొట్టి ప్రారంభించిన అభివృద్ధి కార్యక్రమాలు ఎప్పుడు మంజూరు అయ్యాయో ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. నియోజకవర్గంలో కూటమి నాయకుల భూ ఆక్రమణలు, ఇసుక దోపిడీ, మద్యం ఏరులై పారుతున్న వ్యవహారంపై ప్రజలకు జవాబు చెప్పాల్సిన అవసరం ఎమ్మెల్యేపై ఉందన్నారు. మీ కూటమి పార్టీల మీ దోపిడీలను చూసి విస్తుపోవడమే కాక ధర్నాకు దిగుతామని బాహాటంగా చెబుతున్నారంటే ఏ స్థాయిలో ప్రజలను పీల్చుకు తింటున్నారో అర్థం అవుతోందని మండిపడ్డారు. ఎమ్మెల్యే శ్రీధర్ టీడీపీ నియోజకవర్గ స్థాయి నాయకుల చేసిన వ్యాఖ్యలను స్పందించకుంటే వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలసి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. రైల్వేకోడూరు ప్రాంత అభివృద్ధికి, ప్రజల శ్రేయస్సుకు పని చేసింది ఒకేఒక కొరముట్ల శ్రీనివాసులు అని తెలియజేశారు. రాబోయే రోజుల్లో టీడీపీ నాయకుల అవినీతి, భూదందాలు, మద్యం మాఫియా తదితర అసాంఘిక కార్యక్రమాలను ప్రజలకు తీసుకెళ్తామని చెప్పుకొచ్చారు.

ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలి

సంబేపల్లె : ప్రతి విద్యార్థి కష్టపడి చదివినప్పుడే ఉన్నత శిఖరాలకు చేరతారని దేవపట్ల సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని దేవపట్ల మిట్ట, దేవపట్ల కస్పాలోని ప్రభుత్వం పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్,టీచర్స్ మీట్‌కు ఆయన హాజరయ్యారు. మాట్లాడుతూ విద్యార్థుల బుద్ధి వికాసం, మానసిక స్థైర్యం, భవిష్యత్తు ప్రణాళికలపై ప్రభావం చూపేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం అత్యంత అవసరం. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అదే విధంగా మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ విద్యార్థి తల్లిదండ్రులకు మొక్కలను పంపిణీ చేశారు.

సుండుపల్లె : మండల వ్యాప్తంగా గురువారం మెగా పేరెంట్స్ మీటింగ్ 2.0 అన్ని పాఠశాలల్లో నిర్వహించారు. మండల స్పెషలాఫీసర్ సురేష్‌బాబు మాట్లాడుతూ పిల్లల చదువు అందరి బాధ్యత ఉంటుందన్నారు. విద్యతోపాటు నైపుణ్యాల మెరుగునకు కృషి చేయాలని చెప్పారు. క్రీడల్లో ప్రోత్సహించడంతో పాటు నాయకత్వ లక్షణాలు అలవర్చుకునేందుకు తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమన్నారు. కాగా రాయవరం జెడ్పీహెచ్‌ఎస్ అభివృద్ధికి వేమలయ్య రూ.50వేలు, అదే పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయులు ఎం.నాగరాజునాయక్ రూ.10,116 అందజేశారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

గాలివీడు : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కష్టపడి చదివి వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన పీటీఎం కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవమ్మతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన గ్రామీణ స్థాయి విద్యార్థులు తల్లికి వందనం లాంటి పథకాల ద్వారా అందుతున్న నగదును విద్యకోసం వెచ్చించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రతీ విద్యార్థి తల్లితో కలసి ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలన్నారు.

వీరబల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెగా పీటీఎంను ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ పాఠశాలలు అన్ని విధాల అభివృద్ధ/ జరగాలంటే విద్యార్థుల తల్లిదండ్రులు, దాతల సహాయ సహకారాలు అవసరమన్నారు. అభివృద్ధితోపాటు పిల్లల చదువు విషయంలో ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు కూడా శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఉన్నత పాఠశాలకు స్థల దాత అయిన గాలివీటి వీరనారాయణ రెడ్డి మనవడు శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కాకుండా పాఠశాల నిర్మాణానికే స్థలాన్ని తమ తాత దానం చేశారన్నారు. పాఠశాల పూర్వపు విద్యార్థి పారిశ్రామికవేత్త సుభాష్ రెడ్డి ఇటీవల పదోతరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జవహర్ బాబు, ఎస్ఐ నరసింహా రెడ్డి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



సంబేపల్లె: విద్యార్థుల తల్లిదండ్రులకు మొక్కలను పంపిణీ చేస్తున్న డీపీఓ రాధమ్మ



సుండుపల్లె జెడ్పీహెచ్‌ఎస్‌లో మొక్కలు నాటుతున్న అధికారులు



పెనగలూరు: కస్తూర్బా గాంధీ పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, సిబ్బంది

మండలంలో 221 మొక్కలు ఏర్పాటు

పెనగలూరు : మండలంలో 221 మొక్కలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ విజయారావు, ఏపీఓ విజయకుమారిలు తెలిపారు. పాఠశాల వారిగా ప్రభుత్వ కార్యాలయాలలో ఈ మొక్కలను నాటినట్లు వారు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు తల్లిపేరున ఒక మొక్క నాటి పెంచాలని సూచించారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

మూడు నియోజకవర్గాలలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను ప్రజలు, భక్తులు ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా సాయిబాబా ఆలయాల్లో మూలవిరాట్‌ను ప్రత్యేక పుష్పాలు, పట్టువస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. అలాగే అభిషేకాలు, అర్చనలు, హోమాలు, విశేష పూజలు చేశారు. శ్రీ సాయి, జయజయ సాయి నామ అఖండ భజన, సామూహిక కుంకుమార్చనలు వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. పలు ఆలయాల్లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు సాయిబాబా ఆలయాలకు పెద్దఎత్తున తరలి వచ్చారు.

– సాక్షి, నెట్‌వర్క్



రాజంపేట టౌన్: సాయినాథుడిని దర్శించుకుంటున్న భక్తులు



ఓబులవారిపల్లె: మంగంపేటలో సాయినాథుడికి వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రత్యేక పూజలు



రాజంపేట రూరల్: సాయినాథునికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి, ఎంపీపీ మేడా



సిద్దవటం: భక్తులకు భోజనం వడ్డిస్తున్న కమాండెంట్ ఆనందరెడ్డి



సిద్దవటం: ఆకట్టుకున్న గాంధీ వీధి భజన బృందం కోలాట ప్రదర్శన



రాయచోటి టౌన్: భక్తులకు దర్శనమిస్తున్న సాయిబాబా



రాయచోటి టౌన్: గురుపౌర్ణమి విశిష్టతను వివరిస్తున్న వీరభద్ర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు



పుల్లంపేట: ఉపాధ్యాయుడు బోగా వెంకట రామయ్యను సన్మానిస్తున్న సర్పంచ్, అధికారులు